సాక్షి
రాజన్న సిరిసిల్ల
మంగళవారం । 20 । జూన్ । 2023



రక్తదాతకు సన్మానం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లికి చెందిన మాదాసు శ్రీనివాస్ 28 సార్లు రక్తదానం చేశారు. తంగళ్లపల్లి ఫ్రెండ్స్ క్లబ్ సభ్యులు సోమవారం సన్మానించారు.



మాకూ రూ.లక్ష అందించండి

సిరిసిల్లకల్చరల్: చేతివృత్తుల వారికి అందిస్తామన్న రూ.లక్ష ఆర్థిక సాయాన్ని పద్మశాలీలకు వర్తింపజేయాలని కోరుతూ ప్రవీణ్‌కు వినతిపత్రం అందించారు.

గరిష్టం/కనిష్టం
40.0/30.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

బెస్ట్ గ్రీనరీ మున్సిపాలిటీ సిరిసిల్ల



సిరిసిల్లటౌన్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో హరితోత్సవం నిర్వహించారు. బెస్ట్ గ్రీనరీ మున్సిపాలిటీగా సిరిసిల్ల ఎంపికైంది. ఈమేరకు అవార్డును చైర్‌పర్సన్ జిందం కళ, కమిషనర్ వెల్దండి సమ్మయ్యలకు డిప్యూటీ సీఎం మహమ్మద్ అలీ, మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అందజేశారు. బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి పాల్గొన్నారు.

క్రీడాకారుల సంక్షేమానికి పెద్దపీట



సిరిసిల్లటౌన్: జిల్లా క్రీడాకారుల సంక్షేమానికి మంత్రి కేటీఆర్ పెద్దపీట వేస్తూ సకల సౌకర్యాలు కల్పిస్తున్నారని టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పేర్కొన్నారు. సిరిసిల్ల మినీస్టేడియంలోని వాలీబాల్ అకాడమీని మంత్రి కేటీఆర్ మంగళవారం ప్రారంభించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించారు.మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్యతో మాట్లాడి పలు సూచనలు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, కౌన్సిలర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు బీసీ రుణాలివ్వాలి



ముస్తాబాద్(సిరిసిల్ల): ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడ్డ ముదిరాజ్‌లకు ప్రభుత్వం బీసీ రుణాలు ఇవ్వాలని కోరుతూ మండల శాఖ ఆధ్వర్యంలో ముస్తాబాద్‌లో సోమవారం ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి అధికారులకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ముదిరాజ్‌లపై ప్రభుత్వం చిన్నచూపు తగదన్నారు. ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు పిట్ల రాంగోపాల్, నాయకులు గొడుగు శంకర్, గజ్జెల రాజు, చిగురు నరేశ్, గీస శంకర్, భిక్షపతి, మామిండ్ల ఆంజనేయులు, చంద్రం, సత్యనారాయణ, కిషన్, నర్సయ్య, దేవయ్య, నరేశ్, రాజయ్య పాల్గొన్నారు.

కలప విక్రయంపై విచారణ



వేములవాడరూరల్: వేములవాడ మండలం మల్లారం శివారులోని తుమ్మ చెట్లను పాలకవర్గం సభ్యులు విక్రయించిన దానిపై ఇన్‌చార్జి డీఎల్‌పీవో ప్రదీప్‌కుమార్ సోమవారం విచారణ చేపట్టారు. గతంలో ప్రభుత్వ స్థలంలో ఉన్న తుమ్మ చెట్లను ప్రైవేటు వ్యాపారులకు విక్రయించారు. దీనిపై గ్రామానికి చెందిన కొందరు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం ఇన్‌చార్జి డీఎల్‌పీవో ప్రదీప్‌కుమార్ గ్రామపంచాయతీలో విచారణ చేపట్టి, చెట్లను నరికివేసిన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఎంపీడీవో రాంరెడ్డి, ఎంపీవో రమేశ్, గ్రామ సర్పంచ్ పండుగ తిరుపతి ఉన్నారు.

ఎంపీవో సస్పెన్షన్

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ ఎంపీవోగా విధులు నిర్వహిస్తున్న శ్రీధర్‌ను సస్పెండ్ చేసినట్లు ఎంపీడీవో రాంరెడ్డి తెలిపారు. రెండు రోజులు సెలవులో వెళ్లిన శ్రీధర్.. సెలవులు ముగిసినప్పటికీ విధులకు హాజరుకాలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ చేయడంతో సస్పెండ్ చేసినట్లు తెలిపారు. సూపరింటెండెంట్ రమేశ్‌కు ఇన్‌చార్జి ఎంపీవోగా బాధ్యతలు అప్పగించారు.

విద్య ఉత్సవాలకు రండి

వేములవాడఅర్బన్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించే విద్య దినోత్సవాలకు హాజరుకావాలని ఎమ్మెల్యే రమేశ్‌బాబును ఆహ్వానించారు. స్థానిక సంగీత నిలయంలో సోమవారం జిల్లా విద్యాధికారి రమేశ్ కలిశారు. వేములవాడలోని ప్రభుత్వ పాఠశాలల్లో వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంఈవో బన్నాజీ, సెక్టోరల్ అధికారి విద్యాసాగర్, ఉపాధ్యాయుడు బాల్‌రెడ్డి, సీఆర్పీలు ఆకుల శ్రీనివాస్ నగేశ్ ఉన్నారు.

హరితోత్సాహం



రగుడులో మొక్క నాటుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, చైర్‌పర్సన్ కళ



వేములవాడలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న ఎస్పీ అఖిల్‌మహాజన్



చెక్కపల్లిరోడ్డులో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు, చైర్‌పర్సన్ మాధవి, కమిషనర్ అన్వేశ్

సిరిసిల్లటౌన్/వేములవాడ: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా హరితోత్సవం నిర్వహించారు. సిరిసిల్ల రగుడు జంక్షన్‌లో మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ అనురాగ్ జయంతి పాల్గొని మొక్కలు నాటారు. వేములవాడ పోలీస్‌స్టేషన్ ఆవరణలో విద్యార్థులతో కలసి ఎస్పీ అఖిల్ మహాజన్ మొక్కలు నాటారు. వేములవాడలోని చెక్కపల్లిరోడ్డులో ఎమ్మెల్యే రమేశ్‌బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కమిషనర్ అన్వేశ్ మొక్కలు నాటారు. పవర్‌లూమ్స్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, వైస్‌చైర్మన్ శ్రీనివాస్, కమిషనర్ వెల్దండి సమ్మయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, రైతుబంధు సమితి అధ్యక్షుడు గద్దం నర్సయ్య, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు నాగేంద్రచారి, విశ్వప్రసాద్, రవికుమార్, సీఐలు అనిల్‌కుమార్, ఉపేందర్, కృష్ణకుమార్, బన్సీలాల్, కౌన్సిలర్లు నరాల శేఖర్, మారం కుమార్, సిరిగిరి చందర్, యాచమనేని శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

పల్లెల్లో భూ పంచాయితీ

- అన్నదాతల ఆందోళనబాట
- పరస్పర దాడులతో శాంతిభద్రతలకు విఘాతం
- ఆరు నెలల్లో 150 కేసులు
- పరిష్కారం కాని సాదాబైనామాలు
- ధరణి పోర్టల్‌తోనూ ఇబ్బందులు



ఈ చిత్రంలో సెల్ టవర్ ఎక్కిన రైతు ధరంసోత్ రవినాయక్. ముస్తాబాద్ మండలం సేవాలాల్‌తండా. రవినాయక్ అతని సమీప సోదరుడు ధరంసోత్ బాల్‌రెడ్డినాయక్‌లకు మధ్య పదేళ్లుగా భూవివాదం నడుస్తోంది. బాల్‌రెడ్డినాయక్, రవినాయక్ తండ్రులు పదిహేనేళ్ల క్రితమే భూములు పంచుకున్నారు. బాల్‌రెడ్డినాయక్‌కు 15 గుంటల స్థలం ఎక్కువ వచ్చిందని రవినాయక్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ సమస్యను తండాలో పెద్ద మనుషులు పంచాయితీ చేసిన పరిష్కారం కాలేదు. చివరికి రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. వివాదం సద్దుమణుగకపోగా.. ఇరువర్గాలు పరస్పరం దాడులు చేసుకున్నాయి. ఈక్రమంలో బాల్‌రెడ్డినాయక్ కరెంట్ స్తంభం ఎక్కగా, రవినాయక్ సెల్‌టవర్ ఎక్కాడు. ఇరు వర్గాలపై కేసులు సైతం నమోదయ్యాయి.



భూ సమస్య పరిష్కరించాలని టవర్ ఎక్కిన రైతు రవికి కౌన్సిలింగ్ ఇస్తున్న పోలీసులు (ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): పొలాల మధ్య గెట్ల పంచాయితీ.. సాదాబైనామాల లొల్లి.. 1బీ రికార్డుల్లో తేడాలు.. ధరణితో కొత్త సమస్యలు.. వెరసి పచ్చని పల్లెలు భూపంచాయితీలకు కేరాఫ్‌గా మారుతున్నాయి. ఇటీవల భూముల ధరలు పెరగడంతో ఇంచు భూమి కోసం కూడా దాడులకు దిగుతున్నారు. సాదాబైనామాలు పరిష్కారం కాకపోవడంతో మరిన్నీ వివాదాలు పెరుగుతున్నాయి. ప్రతీ సీజన్‌లో భూమి వివాదాలు తెరపైకి వస్తున్నాయి. పరస్పరం దాడులకు దిగుతుండడంతో ఇరువర్గాలపై కేసులు నమోదవుతున్నాయి. ఇలా గత ఆరు నెలల్లో జిల్లాలో 150 కేసులు నమోదయ్యాయి.

1,583 భూ వివాదాలు

- జిల్లా వ్యాప్తంగా భూ సమస్యలు పరిష్కరించాలని ఆన్‌లైన్‌లో 1,583 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. వీటికితోడు సాదాబైనామాల దరఖాస్తులు అదనం.
- సోదరుల మధ్య భూపంచాయితీ, పేర్లు తప్పుగా రావడం, విస్తీర్ణంలో తప్పులు, ఆన్‌లైన్‌లో భూ విస్తీర్ణం నమోదు కాకపోవడం, 1బీ రికార్డుల్లో నమోదు కాకపోవడం వంటి సమస్యలు ఉన్నాయి.
- పహణీ, వీఆర్వో వ్యవస్థ రద్దు కావడంతో ఇలాంటి సమస్యలు ఎవరు పరిష్కరిస్తారో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు.
- సాదాబైనామాలో విక్రయించిన తర్వాత భూమి ధరలు పెరగడంతో కొందరు తిరగబడుతున్నారు. ఈ పంచాయితీలు పంటలు సాగు చేసే వానాకాలం, యాసంగి సీజన్‌లు ఆరంభంలోనే తెరమీదికొస్తున్నాయి. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు తప్పనిసరి పరిస్థితుల్లో కేసులు నమోదు చేస్తున్నారు.

ఆందోళన బాటపడుతున్న రైతులు

భూ సమస్యలు, వివాదలు పరిష్కారం కాకపోవడంతో రైతులు ఆందోళన బాట పడుతున్నారు. ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, సిరిసిల్ల వంటి మండలాల్లో భూసమస్యలు పరిష్కరించాలని సెల్ టవర్లు ఎక్కడం, ధర్నాలు చేయడం, పురుగుల మందు డబ్బాలతో ఆందోళనలు చేస్తున్నారు. రైతుబంధు, రైతుబీమా వంటి సదుపాయాలను తాము పొందలేక పోతున్నామని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తుండగా, సాదాబైనామాల రెగ్యులరైజ్ కాకపోవడంతో కొందరు రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కొన్ని కేసులు కోర్టుల్లోకి వెళ్లగా.. మరికొన్ని కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ కోర్టుల్లో నడుస్తున్నాయి. శాంతిభద్రతల పరిరక్షణ నేపథ్యంలో పోలీసులు తప్పనిసరి పరిస్థితుల్లో కేసులు నమోదు చేస్తున్నారు. జిల్లాలో గత ఆరు నెలల్లో దాదాపు 150 కేసులు నమోదయ్యాయి.

పరిష్కారం ఇలా...

భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం గతంలో ఊరూరా రెవెన్యూ సదస్సులు నిర్వహించింది. గత ప్రభుత్వాలు సైతం ఆర్వోఆర్ చట్టాన్ని తీసుకొచ్చాయి. కొంత మందికి వీటిపై అవగాహన లేక భూవివాదాలను పరిష్కారం చేసుకోలేకపోయారు. ధరణి పోర్టల్‌లో కొన్ని సమస్యలు ఉండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మాదిరిగా సాదాబైనామాలను పట్టాలు చేయడం, భూసరిహద్దు వివాదాలకు ప్రత్యేక సిబ్బందిని నియమించి పంచనామాలు చేయడం, సర్వేయర్ల పోస్టులు పెంచి భూ వివాదాలను పరిష్కరించే అవకాశం ఉంది. రెవెన్యూ సదస్సులను ఊరూరా నిర్వహించి.. అక్కడికక్కడే సమస్యలు పరిష్కరించాలి.



ఇతను ముస్తాబాద్ మండలం రామలక్ష్మణపల్లికి చెందిన కోటగిరి నాగరాజు. సొంతూరిలో 36 గుంటల భూమిని ఆరేళ్ల క్రితం కొనుగోలు చేశాడు. రిజిస్ట్రేషన్ కోసం తహసీల్దార్ దగ్గరికి పోతే అక్కడ భూమి విలువ రూ.30వేలకు బదులు రూ.1.80 లక్షలు ఉందని చెప్పారు. సరిచేయాలని కోరినా కాలేదు. భూమి అమ్మిన రైతునే రిజిస్ట్రేషన్ ఖర్చు పెట్టుకోవాలని కోరితే అతను అంగీకరించలేదు. ఇప్పుడు భూమి మార్కెట్ విలువ రూ.3లక్షలకు చేరింది. సమస్య పరిష్కారం కాకుండానే ఉంది. ఇరు వర్గాలపై కేసులు నమోదయ్యాయి.

అధికారులకు నివేదిస్తున్నాం



చాలా మంది రైతులు అవగాహన లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ధరణిలో చాలా సమస్యలు పరిష్కారమవుతున్నాయి. పరిష్కారానికి నోచుకోని భూ సమస్యలపై అధికారులకు నివేదిస్తున్నాం. ఎవరూ ఆందోళన చెందొద్దు.

– మునీందర్, తహసీల్దార్

అవగాహన లేక ఆందోళనలు



చాలా మంది రైతులకు భూ సమస్యల పరిష్కారంపై అవగాహన లేదు. తహసీల్దార్, ఉన్నతాధికారుల వద్ద సమస్యలు పరిష్కరించుకోవచ్చు. ధర్నాలు, ఇతరత్ర కార్యక్రమాలు చేస్తే చట్టరీత్య చర్యలు తీసుకోవాల్సి వస్తుంది. భూ వివాదాలపై ఆందోళనలు చేయకుండా అవగాహన కల్పిస్తున్నాం.

– వెంకటేశ్వర్లు, ఎస్సై, ముస్తాబాద్

జిల్లాలో నేడు మంత్రి కేటీఆర్ పర్యటన



సిరిసిల్ల మినీ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల/ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సిరిసిల్ల నియోజకవర్గంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ మంత్రి కేటీఆర్ మంగళవారం పర్యటించనున్నారు. ఉదయం 10.30 గంటలకు గంభీరావుపేట మండలం గోరంట్యాలలో అదనపు తరగతి గదులను, 11 గంటలకు 'మన ఊరు.. మన బడి'లో నిర్మించిన ఎల్లారెడ్డిపేట పాఠశాల భవన సముదాయాన్ని ప్రారంభిస్తారు. ఎల్లారెడ్డిపేట స్కూల్‌లో 60 మంది ఉన్నత పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్ విద్య నందించే కంప్యూటర్ చాంప్స్ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేస్తారు. సిరిసిల్ల పద్మనాయక కల్యాణ మండపంలో మధ్యాహ్నం 2 గంటలకు వేయి మంది దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేస్తారు. 3.30 గంటలకు సిరిసిల్ల శివారులోని రాజీవ్‌నగర్ మినీస్టేడియంలో వాలీబాల్ అకాడమీని ప్రారంభిస్తారు. జిల్లాలో మంత్రి కేటీఆర్ పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ అనురాగ్ జయంతి సోమవారం పరిశీలించారు. జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్, పంచాయతీరాజ్ ఈఈ సూర్యప్రకాశ్, యువజన, క్రీడాశాఖ అధికారి ఉపేందర్‌రావు, ఎంపీడీవో చిరంజీవి, తహసీల్దార్ జయంత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తుగా సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. పార్టీ మండలాధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే గౌస్, ఎల్లారెడ్డిపేట పట్టణాధ్యక్షుడు చెన్ని బాబులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

సారూ...సమస్యలు పరిష్కరించండి

- ప్రజావాణికి తరలివచ్చిన బాధితులు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ అనురాగ్ జయంతి
- వివిధ సమస్యలపై 37 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్లఅర్బన్: క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణికి బాధితులు భారీగా తరలివస్తున్నారు. సోమవారం కలెక్టర్ అనురాగ్ జయంతి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, బాధితులకు సత్వర న్యాయం చేయాలన్నారు. ఫిర్యాదులపై అలసత్వం వహించొద్దని హెచ్చరించారు. వివిధ సమస్యలపై 37 మంది అర్జీలు పెట్టుకున్నారు. అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, జిల్లా అధికారులు ఉన్నారు.

దోపిడీ అరికట్టాలి



జిల్లాలో వైద్యం, విద్య పేరుతో జరుగుతున్న దోపిడీని అరికట్టాలి. ఎలాంటి వసతులు లేకున్నా ఆస్పత్రులు నిర్వహిస్తూ పేదలను మోసం చేస్తున్నారు. అదేవిధంగా విద్యాసంస్థల్లో అడ్డూ అదుపు లేకుండా ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్నారు. – దొబ్బల ప్రవీణ్

సమస్యలు పరిష్కరించాలి



ఎల్లారెడ్డిపేట మండల నారాయణపూర్‌కు చెందిన తోగరి నాగరాజ్‌కి స్కూటీ మంజూరు చేయాలని, బీటీడీ చేసిన కేసీఆర్ నగర్‌కాలనీకి చెందిన కొండ మాధవి తనకు ఉపాధిమార్గం చూపించాలని వేడుకున్నారు.

కేడీసీసీ బ్యాంక్‌లో దోపిడీకి యత్నం



దొంగతనంపై వివరాలు సేకరిస్తున్న పోలీసులు



స్ట్రాంగ్‌రూం డోర్‌ను కట్ చేసిన దొంగలు

- బ్యాంక్ తాళాలు, స్ట్రాంగ్‌రూం డోర్ ధ్వంసం
- ఎల్లారెడ్డిపేటలో కలకలం
- విచారణ చేపట్టిన పోలీసులు
- రంగంలోకి డాగ్‌స్క్వాడ్స్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కేడీసీసీ బ్యాంక్‌లో ఆదివారం రాత్రి దొంగలు దోపిడీకి విఫలయత్నం చేశారు. ఈ సంఘటన స్థానికంగా కలకలం సృష్టించింది. పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న బ్యాంక్‌లోకి దొంగలు ప్రవేశించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జరిగిన సంఘటనపై ఎస్పీ అఖిల్‌మహాజన్ ఆరా తీశారు. బ్యాంక్ అధికారులు, సీఐ మొగిలి తెలిపిన వివరాలు. మండల కేంద్రంలోని కేడీసీసీ బ్యాంక్ వద్ద భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. పనులు చేసేందుకు భవనానికి తూర్పు వైపున పలంచ కొట్టారు. దాని ద్వారా మొదటి అంతస్తుపైకి ఎక్కి.. అల్యూమినియం స్లైడింగ్ కిటికీ నుంచి బ్యాంక్‌లోనికి ఇద్దరు దొంగలు ప్రవేశించారు. మొదట సీసీ కెమెరాలకు సంబంధించిన వైర్లను కట్ చేశారు. అనంతరం బ్యాంక్‌లో ఉన్న రెండు షెట్టర్లను ఇనుపరాడుతో పైకెత్తి స్ట్రాంగ్‌రూం లాకర్‌ను కట్టర్‌తో తెరిచేందుకు ప్రయత్నించారు. తెరుచుకోకపోవడంతో అక్కడే ఉన్న ఫైళ్లను చిందరవందరగా పడేసి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం బ్యాంక్‌ను తెరిచేందుకు వాచ్‌మెన్ అనిల్ వచ్చి పరిస్థితిని మేనేజర్ సంపూర్ణకు వివరించాడు. మేనేజర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ మొగిలి, ఎస్సై ప్రేమ్‌దీప్, క్లూస్‌టీం సభ్యులు, సీసీఎస్ ఎస్సై మారుతి ఆధ్వర్యంలో పోలీసులు రంగంలోకి దిగారు. దొంగల వేలిముద్రలు సేకరించి, డాగ్‌స్క్వాడ్‌లతో గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ పుటేజీల ఆధారంగా బ్యాంక్‌లోకి ఇద్దరూ దొంగలు ప్రవేశించినట్లు సీఐ తెలిపారు. గుర్తుపట్టకుండా ఉండేందుకు తలకు హెల్మెట్, చేతులకు గ్లౌస్‌లు ధరించారన్నారు. సీసీ పుటేజీల ఆధారంగా దొంగలను త్వరలోనే పట్టుకుంటామని వివరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

బ్యాంక్‌లో భద్రత చర్యలు

బ్యాంక్‌లో దొంగతనం జరిగినట్లు తెలుసుకున్న రవీందర్‌రావు హుటాహుటిన ఎల్లారెడ్డిపేటకు వచ్చారు. దొంగతనంపై మేనేజర్ సంపూర్ణ, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి నుంచి వివరాలు సేకరించారు. అనంతరం కృష్ణారెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. బ్యాంక్‌లో కట్టుదిట్టమైన భద్రత ఉందని వినియోగదారులు, రైతులు ఆందోళనకు గురికావద్దని కోరారు. పూర్తి భద్రత వలయంలో బ్యాంక్‌ను నడిపిస్తున్నామని చెప్పారు. నూతన భవనం త్వరలోనే అందుబాటులోకి వస్తుందని తెలిపారు. మధ్యాహ్నం నుంచి బ్యాంక్ లావాదేవీలు కొనసాగించారు. మేనేజర్ సంపూర్ణ, సిబ్బంది ఉన్నారు.

– రవీందర్‌రావు, టెస్కాబ్ చైర్మన్

క్లుప్తంగా

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ప్రతిభ


అజ్మీర దీపిక

గంభీరావుపేట(సిరిసిల్ల): జే ఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో మండలంలోని జగదాంబ తండాకు చెందిన అజ్మీరా దీపిక ప్రతిభ కనబర్చింది. కరీంనగర్ కేంద్రీయ విద్యాలయంలో ఇంటర్మీడియట్ చదివిన దీపిక 79 మార్కులతో ఆలిండియా స్టేట్‌లో 383వ ర్యాంకు సాధించింది. విద్యార్థినిని తండావాసులు, ఉపాధ్యాయులు అభినందించారు.

కోరెంలో డీఎస్పీ విచారణ

బోయినపల్లి(వేములవాడ): మండలంలోని కోరెంలో వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి సోమవారం రాత్రి విచారణ చేపట్టారు. చందుర్తి మండలంలోని లింగంపేటకు చెందిన బండారి శివ గత ఏప్రిల్‌లో బోయినపల్లి మండలం కోరెంలో జరిగిన బీరప్ప ఉత్సవాల సమయంలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ విషయంలో న్యాయం జరగడం లేదని కేసు పక్కదారి పట్టించారని లింగంపేట గ్రామస్తులు ఆదివారం గ్రామంలో ధర్నా చేసిన క్రమంలో సోమవారం డీఎస్పీ కోరెంలో విచారణ చేపట్టారు. పలువురిని విచారించి వివరాలు నమోదు చేసుకున్నారు. హెడ్‌కానిస్టేబుల్ సత్తయ్య తదితరులు ఉన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): మండలంలో అగ్రహారంలో మహాజన్ సంపర్క్ కార్యక్రమాన్ని బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఇన్‌చార్జ్ గంగాడి మోహన్ రెడ్డి, కరెంట్ల మల్లారెడ్డి మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. బీఆర్ఎస్ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మెర్గు హనుమంత గౌడ్, జిల్లా కో కన్వీనర్ ఆడెపు రవీందర్, మండల అధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి, నాయకులు కస్తూరి కార్తీక్ రెడ్డి, నాగుల శ్రీనివాస్, నేవూరి దేవేందర్ రెడ్డి, బంధారపు లక్ష్మారెడ్డి, లక్ష్మారెడ్డి, కిరణ్ నాయక్, శ్రీను, మేడిశెట్టి బాలయ్య, దేవయ్య, యాదగిరి, స్వామి, జిల్లా నాయకులు, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ నుంచి.. సర్కార్ బడికి


బాలికల విద్యాలయంలో ప్రవేశాలు పొందుతున్న విద్యార్థులు


పాఠశాలలో చేరిన విద్యార్థులు

- సత్ఫాలితాలిస్తున్న బడిబాట
- చేరేందుకు విద్యార్థుల ఉత్సాహం
- ఏటా పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రైవేట్ పాఠశాలల నుంచి సర్కార్ బడిలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు మండలవ్యాప్తంగా సుమారు 125 మంది విద్యార్థులు ఆయా పాఠశాలల నుంచి కొత్తగా ప్రవేశాలు పొందారు. ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు ఇంటింటా చేపట్టిన బడిబాట సత్ఫలితాలనిస్తోంది. తాజాగా మండలంలోని వెంకటాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో కొత్తగా సోమవారం 60 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. ఈనెల 12 బడిబాట ప్రారంభం కాగా, నేటి వరకు 60 నూతన అడ్మిషన్లు పాఠశాలలో నమోదైనట్లు ప్రధానోపాధ్యాయుడు శేఖర్ తెలిపారు. ఆరో తరగతిలో పరిమితికి మించి 40 మంది విద్యార్థులు కొత్తగా అడ్మిషన్లు తీసుకున్నట్లు పేర్కొన్నారు. డిజిటల్ బోధనకు విద్యార్థులు ఆకర్షితులవుతున్నట్లు చెప్పారు. విద్యార్థుల చేరికపై ఎస్ఎంసీ చైర్మన్ బోయిని రాధ హర్షం వ్యక్తం చేశారు.

జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో..

సిరిసిల్ల ఎడ్యుకేషన్ : జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల గీతానగర్‌లో కొత్త చేరేందుకు విద్యార్థుల సంఖ్య భారీగా ఉంటుంది. ఈ పాఠశాలలో చేరేందుకు పలువురు రాజకీయ నాయకులు, అధికారుల పైరవీలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈనెల 12 పాఠశాలలు ప్రారంభం కాగా సోమవారం వరకు 250 కొత్తగా విద్యార్థులు ప్రవేశాలు పొందినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భాగ్యరేఖ వెల్లడించారు. ఇందులో వివిధ ప్రైవేటు పాఠశాలల నుంచి 110 మంది విద్యార్థులు, ప్రభుత్వ పాఠశాలల నుంచి 140 ప్రవేశాలు పొందినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. గివ్ తెలంగాణ, డీవీస్, మంత్రి కేటీఆర్ సహకారంతో పాఠశాలలో వసతులు మెరుగుపడ్డాయని, దీంతో విద్యార్థులు చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారన్నారు. 2020–21 విద్యా సంవత్సరంలో 670 మంది విద్యార్థులుండగా ఏటా విద్యార్థులు ప్రవేశాలు పొందడంతో ఈ విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి పాఠశాలలోని మొత్తం విద్యార్థులు సంఖ్య 951మంది అని తెలిపారు. ఈనెలాఖరు వరకు పాఠశాలలో విద్యార్థుల సంఖ్య వెయ్యివరకు చేరే అవకాశాలున్నాయన్నారు.

ఘనంగా సాయిబాబా వార్షికోత్సవం


ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు


వెండి కిరీటం అందిస్తున్న ఎన్నారై దేవేందర్

- వెండి కిరీటం బహూకరించిన ఎన్నారై దేవేందర్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని నారాయణపూర్ శ్రీషిర్డీ సాయిబాబా 33వ ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారి చిత్రపటంతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అర్చకులు శివశాస్త్రీ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో హోమం జరిపారు. మహిళలు మంగళహారతులతో ఆలయానికి తలరివచ్చారు. గ్రామానికి చెందిన ఎన్నారై కొండేటి దేవేందర్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని స్వామి వారికి రూ.15వేల విలువ గల వెండి కిరీటం బహూకరించారు. దేవేందర్‌ను గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ నిర్మాణకర్త ఏరె నర్సయ్య, సర్పంచ్ నిమ్మ లక్ష్మి, ఎంపీటీసీ అఫేరా సుల్తాన, ఉపసర్పంచ్ మహేందర్, మాజీ సర్పంచ్ దొమ్మాటి నర్సయ్య, ఎన్నారై దేవేందర్, చింతాల రాకేశ్‌గౌడ్, లింగాల యాదగిరిగౌడ్ పాల్గొన్నారు.

రాజన్నా.. రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు కల్పించు

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్


రాజన్నకు కోడె మొక్కు చెల్లిస్తున్న డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు

వేములవాడ: ఏటా రూ.100 కోట్లు మంజూరుచేసి గుడిని అభివృద్ధి చేస్తామని ప్రకటించి ఎనిమిదేళ్ల గడుస్తున్నా నయాపైసా ఇవ్వని రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు కల్పించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు సోమవారం రాజన్నకు ఎనిమిది కోడెలతో మొక్కు చెల్లించారు. డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ యాదాద్రి తరహాలో వేములవాడను అభివృద్ధి చేస్తానంటూ మూడుసార్లు కుటుంబ సభ్యులతో వచ్చి పరిశీలించిన సీఎం కేసీఆర్ ఇప్పటికీ మూడు పనులు కూడా చేయలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే వైఫల్యంతోనే గుడి, వేములవాడ పట్టణం వెనుకబడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయ ఆవరణలో కనీసం ప్రథమ చికిత్స కేంద్రం లేదన్నారు. సాగారం వెంకటస్వామి, పిల్లి కనకయ్య, చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, చిలుక రమేశ్, కూరగాయల కొమురయ్య, పాత సత్యలక్ష్మి, తోట లహరి, కనికరపు రాకేశ్, కత్తి కనకయ్య, వనపట్ల ప్రభాకర్‌రెడ్డి, ఇటిక్యాల లింగయ్య, బోనాల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ

సిరిసిల్లక్రైం : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలు సాధించాలని జెడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. జెడ్పీహెచ్ఎస్ నెహ్రూనగర్‌లోని సోమవారం జిల్లాస్థాయి టీచింగ్ లర్నింగ్ మెటీరియల్ మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు కనీస అభ్యసనా సామర్థ్యాలు, సులభతరంగా విద్య అందిచేందుకే నేర్పించేందుకు ప్రభుత్వ పాఠశాలలో తొలిమెట్టు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, మౌలిక వసతుల ఏర్పాట్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేల కోట్లు ఖర్చు చేస్తునందన్నారు. పాఠశాలల్లో అదనపు తరగతుల నిర్మాణం, పారిశుధ్యం, విద్యుత్, నీటి వసతి, మురుగుదొడ్లు, కిచెన్ షెడ్స్, కాంపౌండ్ వాల్స్, ఏర్పాటు చేయనున్నారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 56 గురుకులాలు మాత్రమే ఉండేవని, రాష్ట్రం ఏర్పాటు తర్వాత 500 గురుకుల పాఠశాలను ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్ర పరిశీలకుడు సోమిరెడ్డి, జిల్లా విద్యాధికారి రమేశ్ కుమార్, ఎంఈవో రఘుపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు గ్రంథాలయం ప్రారంభం



తంగళ్లపల్లిలోని గ్రంథాలయం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండల కేంద్రంలో గ్రంథాలయాన్ని మంగళవారం తిరిగి ప్రారంభించనున్నారు. 1990లో 'ప్రేమ సమాజ గ్రంథాలయం' పేరుతో ఏర్పాటుచేసిన గ్రంథాలయం కాలక్రమేణ అధికారుల పట్టించుకోకపోవడంతో ఫిబ్రవరి 25న 'పత్తాలేని గ్రంథాలయం'పేరుతో 'సాక్షి'లో కథనం ప్రచురించింది. దీంతో స్పందించిన జిల్లా గ్రంథాలయ అధికారులు ప్రత్యేక నిధులతో గ్రంథాలయాన్ని మరమ్మతుచేసి అందంగా తీర్చిదిద్దారు. మంగళవారం ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు, గ్రామస్తులు 'సాక్షి'కి ధన్యవాదాలు తెలిపారు.

పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య
- పాఠశాల ప్రారంభానికి తరలిరండి


మాట్లాడుతున్న ఆగయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలో సోమవారం ఆగయ్య మాట్లాడుతూ.. మంత్రి కేటీఆర్ సహకారంతో రూ.8.50 కోట్లతో ఆధునిక వసతులతో పాఠశాల సమీకృత భవన సముదాయాలను నిర్మించినట్లు తెలిపారు. ఈ అవకాశాలను పేద, మధ్యతరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసిన మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆధునిక హంగులతో నిర్మించిన భవనాన్ని మంగళవారం మంత్రి ప్రారంభిస్తున్నారని, ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు, పార్టీ నాయకులు హాజరు కావాలని కోరారు.

అర్హులకు ఓటుహక్కు

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- అఖిలపక్ష నేతలతో సమావేశం


మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలోని అర్హులందరూ ఓటరుగా నమోదయ్యేలా రాజకీయ పార్టీలు కృషి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం సాయంత్రం అఖిలపక్ష నేతలతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ 2023 అక్టోబరు 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండే వారిని ఓటర్లుగా నమోదు చేస్తామన్నారు. జూన్ 25వ తేదీ నుంచి జూలై 23వ తేదీ వరకు బూత్ లెవల్ అధికారులు ఇంటింటి సర్వేలు చేస్తారని తెలిపారు. ఓటర్ల జాబితాలో సవరణలకు అవకాశం ఉందని, తప్పులు లేని ఓటర్ల జాబితాను సిద్ధం చేసేందుకు అఖిలపక్ష నేతలు సహకరించాలని కోరారు. సిరిసిల్ల తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార రహెమాన్, అఖిలపక్ష నేతలు సంగీతం శ్రీనివాస్, పొలాస నరేందర్, మూషం రమేశ్, చొక్కాల రాము, గజభీంకార్ రాజన్న, కోడం రమణ, గూడూరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ మున్నూరు కాపు అడహక్ కమిటీ ఎన్నిక


నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలుపుతున్న మున్నూరు కాపు సంఘం సభ్యులు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణ మున్నూరు కాపు అడహక్ కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడుగా గడ్డం నర్సయ్య, కన్వీనర్‌గా అగ్గి రాములును ఎన్నుకున్నారు. మున్నూరు కాపు సంఘం అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. నూతన కమిటీకి మున్నూరు కాపు సంఘం సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. కో కన్వీనర్లు నీలి శంకర్, కల్లూరి రాజు, కృష్ణ, బైరి ప్రభాకర్, మధు, భీమవరం శ్రీనివాస్, తదితరులున్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి


డీఈఓతో మాట్లాడుతున్న నాయకులు

సిరిసిల్లఎడ్యుకేషన్: ప్రభుత్వ విద్యాలయాల్లోని సమస్యలు పరిష్కరించాలని టీటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొండికొప్పుల రవి, తడకల సురేశ్ డీఈవో రమేశ్‌కుమార్‌కు విన్నవించారు. సోమవారం డీఈవోను కలిసి పలు సమస్యలు వివరించారు. వందశాతం పుస్తకాలు, రెండు జతల యూనిఫామ్స్, నోట్‌బుక్స్, స్కూళ్లలో పారిశుధ్య కార్మికులను నియమించాలని, ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని కోరారు.

కలెక్టరేట్ ఎదుట నిరసన


నిరసన తెలుపుతున్న కార్మికులు

సిరిసిల్లటౌన్: పెండింగ్ బిల్లుల కోసం మధ్యాహ్న కార్మికులు, రైతురుణ మాఫీపై రైతుసంఘం ఆధ్వర్యంలో సోమవారం సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. నెలల తరబడి ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడం సరికాదన్నారు. అనంతరం కార్మికుల పెండింగ్ బిల్లులు, సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. ఇల్లందుల ఎల్లవ్వ, నడికొట్టు లక్ష్మి, రాజేశ్వరి, ఎల్లవ్వ, ఏఐటీయూసీ నాయకులు అజ్జ వేణు, మీస లక్ష్మణ్, మంచికట్ల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలి

రాష్ట్ర వ్యాప్తంగా రైతుల రుణాలను ఏక మొత్తంలో మాఫీ చేసి కొత్త రుణాలను అందించాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి జంగం అంజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టరేట్ ఏవో గంగయ్యకు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించి మాట్లాడారు. ధరణి పోర్టల్‌లో లోపాలను సవరించి, డాక్టర్ స్వామినాథన్ కమిషన్ ప్రకారం మద్దతు ధర నిర్ణయించాలన్నారు. కౌలు రైతుల సంక్షేమానికి సర్కారు చర్యలు తీసుకోవాలని, నకిలీ విత్తనాలను అమ్మేవారిపై పీడీ యాక్టు నమోదు చేయాలన్నారు. నాయకులు కోవుటు రాములు, రాగుల మల్లేశం తదితరులున్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే శిశువు మృతి

- ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన


ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న రఘుపతి కుటుంబ సభ్యులు, బంధువులు

వేములవాడఅర్బన్: వైద్యుల నిర్లక్ష్యంతోనే నా బిడ్డ చనిపోయిందని రఘుపతి అన్నారు. వేములవాడ ఏరియా ఆస్పత్రి ముందు కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈనెల 8న ప్రసవం కోసం తన భార్యను ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించామని, 9న ఆపరేషన్ తర్వాత పాప పుట్టడంతో వైద్యుల పర్యవేక్షణలో ఉండాలని తెలిపారని, సుమారు రెండుగంటల తర్వాత పరిస్థితి బాగో లేకపోకపోవడంతో సిరిసిల్ల జిల్లా ఆస్పత్రికి తరలించాలని సూచించారన్నారు. సిరిసిల్లలోని ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే పాప మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారన్నారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే పాప చనిపోయిందని కలెక్టర్, జిల్లా వైద్యాధికారికి కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయినా పట్టించుకోకపోవడం లేదని వైద్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మహేశ్‌రావును వివరణ కోరగా వైద్యుల పర్యవేక్షణలోనే ఆపరేషన్ చేశామని, పిల్లల వైద్యుడు పరీక్షించి పాప పరిస్థితి బాగాలేదని, దాంతో సిరిసిల్ల ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించామన్నారు.

సన్మానం


డాక్టర్ లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న లగిశెట్టి శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం చేనేత భరోసా యాత్ర నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీజేపీ ఓబీసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సూచన మేరకు జరిగిన కార్యక్రమంలో సిరిసిల్లకు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లగిశెట్టి శ్రీనివాస్ డాక్టర్ లక్ష్మణ్‌ను సన్మానించారు.

అధిక ధరలకు పుస్తకాల విక్రయం

- కేరళ మోడల్ స్కూల్ ఎదుట ఏబీవీపీ నాయకుల నిరసన

వేములవాడఅర్బన్: ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థులను నిలువు దోపిడీ చేస్తున్నాయని, పాఠశాలలోనే పుస్తకాలు, బ్యాగులు, టై, బెల్టు, షూ లను తీసుకోవడంతో విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. పట్టణంలోని కేరళ మోడల్ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారని తల్లిదండ్రుల ద్వారా తెలుసుకున్న ఏబీవీపీ నాయకులు సోమవారం పాఠశాలలో కరస్పాండెంట్‌ను నిలదీశారు. కరస్పాండెంట్ మనోజ్ సమాధానం ఇవ్వకపోవడంతో విద్యార్థి సంఘం నాయకులు పుస్తకాల గది తాళాన్ని పగులగొట్టి, పుస్తకాలను బయటపెట్టి నిరసన వ్యక్తం చే శారు. అనంతరం విద్యాశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో సీఆర్పీ ఆకుల శ్రీ ని వాస్ పుస్తకాల గదిని సీజ్ చేశారు. కలెక్టర్ దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏ బీవీపీ నాయకులు రాజు, విశాల్, కార్తీక్, తదితరులున్నారు.

గురుకులంలో పాత పుస్తకాల అమ్మకం

- టెండర్ లేకుండా అమ్మకాలపై అనుమానాలు

సిరిసిల్ల ఎడ్యుకేషన్: తంగళ్లపల్లి మండలంలోని మైనార్టీ గురుకులంలో పాత పుస్తకాల అమ్మకం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. పుస్తకాలు ఇతర సామగ్రితో ఓ ధర్మకాంట వద్ద తూకం వేస్తున్న ట్రాలీ ఆటోలో పుస్తకాలను గమనించిన స్థానికులు ఇదేంటని అడిగితే మైనార్టీ గురుకులం నుంచి తీసుకువచ్చినట్లు తెలిపారు. 10 టన్నుల వస్తువులు పుస్తకాలను టెండర్ లేకుండా విక్రయించడం ఏంటని వాపోతున్నారు. ఏటా టెండర్ వేసి అమ్మకాలు జరిపేవారని, ఈ ఏడాది నేరుగా అమ్మకాలు జరిపినట్లు ట్రాలీ ఆటోలోని వ్యక్తులు తెలిపారు. దీనిపై మైనార్టీ గురుకుల ప్రిన్సిపాల్ ఫాతిమాను వివరణ కోరగా విక్రయించిన విషయం వాస్తవమని ఉన్నతాధికారుల ఆదేశాలలతో విక్రయాలు జరిపినట్లు తెలిపారు.

దుబాయిలో గుండెపోటుతో యువకుడి మృతి


నవీన్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన శివయ్యగారి నవీన్(29) దుబాయిలో గుండెపోటుతో మృతిచెందాడు. నవీన్‌కు ఏడాది క్రితం పెళ్లికాగా.. భార్యను సైతం దుబాయికి తీసుకెళ్లాడు. మరణవార్త విన్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఒక్కగానొక్క కొడుకు దుబాయిలో మృతిచెందడంతో తండ్రి నర్సయ్య, తల్లి నర్సవ్వ రోదనలు మిన్నంటాయి. పెళ్లి చేసుకున్న వెంటనే భార్యతో కలిసి ఉపాధి కోసం ఎడారి దేశాలకు వెళ్లిన యువకుడు చిన్న వయసులోనే గుండెపోటు గురికావడం గ్రామస్తులను కలచివేసింది. కాగా మృతుని మిత్రులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఎల్లారెడ్డిపేటలో విషాదం అలుముకుంది. మంత్రి కేటీఆర్ చొరవ తీసుకొని మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

- ఒకరి పరిస్థితి విషమం
- సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలింపు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి శివారులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వేములవాడ పట్టణానికి చెందిన బంధం రాణి తన కుమారులు ప్రశాంత్, ప్రణీత్‌లతో కలిసి బైక్‌పై ఎల్లారెడ్డిపేట నుంచి వేములవాడ వెళ్తున్నారు. ఈక్రమంలో రాగట్లపల్లి సమీపంలో పదిర గ్రామానికి చెందిన కమ్మరి భూమయ్య బైక్‌తో వెనుక నుంచి అతివేగంగా ఢీకొట్టాడు. భూమయ్యకు స్వల్పంగా గాయాలయ్యాయి. ఈ సంఘటనలో బంధం రాణి కుమారులకు స్వల్పగాయాలు కాగా రాణి తలకు బలంగా తగలడంతో పరిస్థితి విషమంగా మారింది. ఎల్లారెడ్డిపేట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు.